# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 05-01-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ గుజరాత్‌లోని సోమనాథ్ దేవాలయం ఎన్నో ఒడిదొడుకులను తట్టుకొని మొక్కవోని నాగరికత స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- ❖ భారత భవిష్యత్ నాయకత్వ నిర్మాణానికి ఎన్‌సీసీ దోహదపడుతోందని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కొనియాడారు.
- ❖ కోస్ట్ గార్డుకు చెందిన తొలి స్వదేశీ కాలుష్య నియంత్రణ నౌక `సముద్ర ప్రతాప్` గోవాలో ఈరోజు జలప్రవేశం చేసింది.
- ❖ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పారదర్శకత తీసుకురావడానికి ప్రభుత్వం "వికసిత్ భారత్ జి రామ్ జి" చట్టాన్ని తీసుకువచ్చిందని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.
- ❖ భారత్, దక్షిణాఫ్రికా అండర్-19 జట్ల మధ్య జరుగుతున్న రెండవ వన్డే క్రికెట్ మ్యాచ్ కు అంతరాయం ఏర్పడింది.

==================

గుజరాత్ లోని సోమనాథ్ దేవాలయం శతాబ్దాలుగా ఎన్నో దాడులకు గురైనప్పటికీ తట్టుకుని దేశ స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సోమనాథ్ దేవాలయంపై దాడి జరిగి వెయ్యి సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈరోజు ఆయన తన బ్లాగ్ లో రాసిన ఒక కథనాన్ని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో జత చేశారు. ఎన్నో ఒడిదొడుకులకు లోనైనప్పటికీ ఈ దేవాలయం మొక్కవోని నాగరికత స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచిందని తెలిపారు. ఈ కట్టడం ఎన్నో సంఘర్షణలు తట్టుకుని తన పూర్వ వైభవంతో నిలబడగలిగిందని పేర్కొన్నారు. సోమనాథ్ అనే పదాన్ని వినగానే దేశ ప్రజల హృదయాలలో గర్వం ఉప్పొంగుతుందని, ఇది భారతదేశ ఆత్మకు ప్రతీక అని ప్రధానమంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = =

భారత భవిష్యత్ నాయకత్వ నిర్మాణానికి ఎన్‌సీసీ దోహదపడుతోందని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కొనియాడారు. న్యూఢిల్లీలో ఈరోజు నిర్వహించిన నేషనల్ క్యాడెట్ కోర్ (ఎన్‌సీసీ) 2026 గణతంత్ర దినోత్సవ శిబిరం ప్రారంభోత్సవానికి ఉపరాష్ట్రపతి సీ పీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దేశ నిర్మాణంలో, యువత అభివృద్ధిలో ఎన్‌సీసీ అందిస్తున్న నిరంతర సేవలను ఆయన కొనియాడారు. క్రమశిక్షణ, బాధ్యత, దేశభక్తి కలిగిన పౌరులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తూ.. ప్రస్తుతం ఇది ప్రపంచంలోనే అతిపెద్ద యూనిఫాం ధరించిన యువజన సంస్థగా ఎదిగిందని ఆయన ప్రశంసించారు. యువతపై దేశానికి ఉన్న విశ్వాసానికి, బలమైన, ఐక్య దేశాన్ని నిర్మించాలనే మనందరి నిబద్ధతకు గణతంత్ర దినోత్సవ శిబిరం శక్తిమంతమైన ప్రతీకగా నిలుస్తుందని అభివర్ణించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎన్‌సీసీ క్యాడెట్లు అందించిన అసాధారణ సేవలను ఉపరాష్ట్రపతి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = =

భారత తీర రక్షక దళం కోస్ట్ గార్డుకు చెందిన తొలి స్వదేశీ కాలుష్య నియంత్రణ నౌక `సముద్ర ప్రతాప్` గోవాలో ఈరోజు జలప్రవేశం చేసింది. 114.5 మీటర్ల పొడవు గల ఈ నౌకలో 60 శాతం కంటే ఎక్కువగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన విడి భాగాలు ఉపయోగించారు. 4,200 టన్నుల బరువున్న ఈ నౌక గంటకు 22 నాట్స్ కు మించిన వేగంతో ప్రయాణించగలదు. ఈ నౌక జలప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరయ్యారు. దేశ ప్రజల ఉమ్మడి కార్యసాధనకు ఈ నౌక చిహ్నంగా నిలుస్తుందని రాజ్ నాథ్ సింగ్ ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు. తీర ప్రాంత భద్రత సమస్యలు పరిష్కృతం అవుతాయని అన్నారు. సముద్ర జీవ వైవిధ్యతను కాపాడవలసిన నైతిక బాధ్యతను నెరవేర్చడానికి ఈ నౌక దోహదపడుతుందన్నారు. భవిష్యత్ లో చేపట్టబోయే ప్రాజెక్టులను 90 శాతం పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించాలని ఆయన కోరారు.

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = =

గతంలో ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పారదర్శకత తీసుకురావడానికి ప్రభుత్వం వికసిత్ భారత్ జి రామ్ జి చట్టాన్ని తీసుకువచ్చిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఈరోజు తమిళనాడులోని ఈరోడ్‌లో రైతులతో మాట్లాడిన ఆయన ఈ పథకాన్ని లబ్ధిదారుల కోసం 125 రోజులకు పొడిగించామని చెప్పారు. లబ్ధిదారులకు చెల్లింపులు ఇకపై సకాలంలో అందుతాయని మంత్రి హామీ ఇచ్చారు. లబ్ధిదారులు పని చేసిన 15 రోజులలోపు వారికి చెల్లింపులు జరగకపోతే.. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ పథకం ద్వారా రైతులు నిరంతరం ప్రయోజనం పొందేలా గ్రామీణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తామని చెప్పారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = =

దేశంలో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు గడచిన పదకొండు సంవత్సరాల్లో 6 రెట్లు పెరిగాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. అలాగే సంబంధిత ఎగుమతులు 8 రెట్లు పెరిగాయని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. యాపిల్-2025లో 5 వేల కోట్ల డాలర్ల విలువైన మొబైల్ ఫోన్లను భారత్ లోనే తయారు చేసిందని చెప్పారు. ల్యాప్‌టాప్ లు, సర్వర్లు సహా 46 ఎలక్ట్రానిక్స్ విడి భాగాల తయారీ ప్రాజెక్టు ఎలక్ట్రానిక్స్ వస్తువుల తయారీలో కీలకంగా మారాయన్నారు. ఈ సంవత్సరం నాలుగు సెమీకండక్టర్ ప్లాంట్లు

వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభిస్తాయని చెప్పారు. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో ఉద్యోగాల సంఖ్య ఇప్పుడు 25 లక్షలుగా ఉందని, అనేక ఫ్యాక్టరీలు ఒకే చోట 5 వేల మందరికి పైగా ఉద్యోగులను నియమిస్తున్నాయని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = =

అస్సాంలో ఈరోజు తెల్లవారుజామున 4 గంటల 15 నిమిషాలకు భూకంపం సంభవించింది. మోరీ గావ్ జిల్లాలో భూతలానికి 50 కిలో మీటర్ల లోతున భూకంప కేంద్రం కేంద్రీకృతమయ్యింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్ పై 5.1గా నమోదైంది. భూకంపం సంభవించినప్పుడు మోరీ గావ్ సహా పరిసర జిల్లాల్లో భూప్రకంపనలు నమోదయ్యాయి. ఆందోళన చెందిన ప్రజలు ఇళ్ల నుండి బయటికి పరుగులు పెట్టారు. ఆయితే ఈ భూకంపం ధాటికి ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. పొరుగు దేశాలైన భూటాన్, నేపాల్, బంగ్లాదేశ్ లలో కూడా ఈ భూకంప ప్రకంపనలు నమోదయ్యాయి.

= = = = = = = = = = = = = = = = = =

దక్షిణాఫ్రికాలోని బెనోని వేదికగా భారత్, దక్షిణాఫ్రికా అండర్-19 జట్ల మధ్య వన్డే క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.  టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా జట్టు 49.3 ఓవర్లలో 245 పరుగులకు ఆలౌటైంది. భారత యువ పేసర్ కిషన్ కుమార్ సింగ్ 4 వికెట్లు తీయగా, దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ జాసన్ రొవెల్స్ 114 పరుగులతో రాణించాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ జట్టు 12.5 ఓవర్లు పూర్తయ్యే సరికి 2 వికెట్లు కోల్పోయి 115 పరుగులు చేసింది. వెలుతురు లేమి కారణంగా మ్యాచ్‌కు అంతరాయం ఏర్పడింది. భారత విజయానికి ఇంకా 115 పరుగులు చేయాల్సి ఉంది. కాగా మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ డక్వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం దక్షిణాఫ్రికాపై 25 పరుగుల తేడాతో విజయం సాధించింది.

= = = = = = = = = = = = = = = = = =

వాయువ్య, మధ్య, ఈశాన్య భారతదేశంలో రానున్న 4 రోజులు పాటు దట్టమైన పొగమంచు వాతావరణం కొనసాగుతుందని  భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. ఢిల్లీ, ఛండీఘర్, ఈశాన్య ఉత్తరప్రదేశ్, హర్యానా, మధ్యప్రదేశ్, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాల్లో రేపు దట్టమైన పొగ మంచు కురిసే అవకాశం ఉండడంతో ఐఎండీ ఆరెంజ్ హెచ్చరికను జారీ చేసింది. పశ్చిమ బెంగాల్ గంగానది తీర ప్రాంతం, జార్ఖండ్ ప్రాంతాల్లో అక్కడక్కడ రానున్న రెండు రోజుల పాటు పొగ మంచు ఆవరించి ఉండవచ్చని తెలిపింది. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో కూడా ఈ నెల 9 వరకు ఇలాంటి పరిస్థితే కొనసాగవచ్చని ఐఎండీ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 85 వేల 762 పాయింట్ల వద్ద నష్టాలతో ప్రారంభమై... చివరికి 322 పాయింట్ల నష్టంతో 85 వేల 439 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 78 పాయింట్లు నష్టపోయి 26 వేల 250 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 90 రూపాయల 28 పైసలుగా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 60.76 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4 వేల 435 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = =